క్లుప్తంగా

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ



వీపనగండ్ల: మండలంలోని పలువురికి కాంగ్రెస్ నాయకులు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శనివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీరయ్యయాదవ్, మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. వీపనగండ్లకు చెందిన బాలపీర్‌కు రూ.33,500, నక్క శేషయ్యకు రూ.29వేలు, జింకల మనీషాకు రూ.25వేలు, నక్కసంగెంకు రూ.19వేలు, జొల్లా పెద్దగంగయ్యకు రూ.9వేల చెక్కు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో చెక్కులను మంజూరు చేయించినట్లు వారు తెలిపారు. నాయకులు నక్కవిష్ణు, యాదయ్య, కావలిమహేష్, రవీందర్‌రెడ్డి, గోపి, రాజు, వెంకటేష్, శాంతిరెడ్డి, అంజి, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

ఖిల్లాఘనపురం: మండలంలోని రైతులకు ఉపయోగపడే వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందించేందుకు మంజూరయ్యాయని మండల వ్యవసాయ అధికారి మల్లయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టేట్‌మిషన్‌ఆన్ అగ్రికల్చర్ మిషనరీ పథకం ద్వారా ఈ పరికరాలు 40 శాతం రాయితీతో రైతులకు అందించడం జరుగుతుందని ఆయన చెప్పారు. మండలానికి 44 బ్యాటరీ మందు పంపులు, 12 తైవాన్ పంపులు, 2 రోటవేటర్, 1 సీడ్‌విల్, 4 కల్టివేటర్లు, 3 వీడర్స్ మొత్తం 66 పరికరాలు మంజూరైనాయని ఆయన చెప్పారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, దరఖాస్తు ఫాం, ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన చెప్పారు.

నేడు ఆలయం మూసివేత

గోపాల్‌పేట: చంద్రగ్రహణం ఉన్నందున మండలంలోని బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయం మూయనున్నామని ఈఓ రామేశ్వర శర్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా బుద్దారం గండి ఆంజనేయస్వామి గుడిని మూసివేయనున్నామని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12:55 గంటల నుంచి మూసివేస్తామని అలాగే సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం ఆలయాన్ని తెరవనున్నట్లు తెలిపారు.

బాధితులను పరామర్శించిన మాజీమంత్రి

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామంలో మృతిచెందిన, అనారోగ్యానికి గురైన పలువురు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. రేవల్లి మండలంలోని నాగపూర్ గ్రామంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు దొడ్డికురుమయ్య తల్లి ఆకస్మికంగా మృతిచెందింది. శనివారం వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన మైను కుటుంబ సభ్యులను పరామర్శించారు. మోటార్‌సైకిల్, సైకిల్‌పైనుంచి కింద పడిన ఇద్దరిని పరామర్శించారు. పార్టీకోసం పనిచేసేవారికి ఎప్పుడూ అండగా ఉంటానని కార్యకర్తలు ఎవరూ దిగులు చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్యకర్తలు

గోపాల్‌పేట: చేపడుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని రేవల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్వతాలు అన్నారు. శనివారం బీఆర్ఎస్‌కు చెందిన 15 మంది శనివారం ఎమ్మెల్యే మేఘారెడ్డి ఇంటివద్ద ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరింతమంది చేరనున్నారని తెలిపారు.

విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు

వనపర్తి రూరల్: చట్ట వ్యతిరేక పనులకు ఉపేక్షించేది లేదని, పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శోభాయాత్రలు భక్తిశ్రద్ధలతో, ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా జరుపుకోవాలని జిల్లా పోలీసుశాఖ నిర్వాహకులకు ఇదివరకే సూచించామని తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో వనపర్తి పట్టణంలోని రాయిగడ్డ కాలనీలో కొంతమంది ఆకతాయిలు పోలీసుల మాటను లెక్కచేయకుండా వ్యవహరిస్తూ, శోభాయాత్రలో డీజే ఏర్పాటు చేసి అధిక సౌండ్‌తో ప్రజలకు ఇబ్బంది కల్గిస్తున్నారని సమాచారం రావడంతో పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ సిబ్బందితో కలసి అక్కడికి చేరుకున్నారు. మద్యం మత్తులో ఉన్న యువకులు పోలీసులకు ఎదురుతిరిగడమే గాక వారి ప్రభుత్వ వాహనాన్ని అడ్డుకొని దుర్భాషలాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆ ముగ్గురి యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామని తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించినా అలాంటి వారిపై ఉపేక్షించబోమని ఎస్పీ రావుల గిరిధర్ హెచ్చరించారు.

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం



కూలేందుకు సిద్ధంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయ భవనం

- భయంతో పనిచేస్తున్న ఉద్యోగులు..
- ఉపాధిహామీ ఆఫీసులో ఇదే స్థితి..
- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలి

మదనాపురం: మదనాపురం మండల పరిపాలనకు కేంద్రంగా పని చేసిన తహసీల్దార్ కార్యాలయం భవనం ఇప్పుడు శిథిలావస్థకు దర్శనమిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పై కప్పు నుంచి తుమ్ముర్లు పడటం, గోడలు తడిసి రంగుమారటం, సీలింగ్ కూలే ప్రమాదం ఏర్పడటం వంటి ఘటనలు ప్రతిరోజూ కనిపిస్తున్నాయి. ఈ భయానక పరిస్థితుల్లో ఉద్యోగులు భద్రత లేని వాతావరణంలో తప్పని పరిస్థితిలో విధులు నిర్వహిస్తున్నారు. వర్షం పడుతుంటే పైనుంచి తుంపర్లు కారుతుంది. కూర్చోవడానికి స్థలం లేదు. కంప్యూటర్లు, డాక్యుమెంట్లు అన్నీ తడిచే ప్రమాదం ఉంది. పై కప్పు ఎప్పుడు కూలుతుందోనని భయంతో పని



కార్యాలయ వెనక భాగం

చేస్తున్నామని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధిహామీ ఆఫీసులో..

ఈ భవనం పక్కలోనే పనిచేస్తున్న ఉపాధిహామీ పథక సిబ్బంది పరిస్థితి మరింత దారుణంగా మారింది. వర్షాకాలంలో కార్యాలయం కిటకిటలాడుతోంది. టేబుళ్లకు ఎటు తిప్పినా తడిచిన గోడలు, లీకవుతున్న పై కప్పు, తట్టుకోలేని వాసన ఉద్యోగులను మానసికంగా కూడా కుంగదీస్తోంది.

> **కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం**
>
> వర్ష వస్తే తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటుంది వాస్తవమే. శిథిలావస్థలో ఉన్న ఆఫీస్‌ను త్వరలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నాం. ఉన్నతాధికారులకు ఈ విషయాన్ని సమస్యను వివరిస్తాం.
>
> – తహసీల్దార్ జే.కే.మోహన్, మదనాపురం

మరమ్మతు చేయాలి ..

ముఖ్యమైన కార్యాలయాలు ఇలా శిథిలంగా ఉండడం అధికారులకు ఇబ్బందులు ఏర్పడే ప్రమాదం ఉంది. వెంటనే భవన మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

దశాబ్దకాలంగా మరమ్మతులు నోచుకోక..

2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూతనంగా ఏర్పాటైన మండలాల్లో మదనాపురం మండలం ఒకటి. మండల కార్యాలయం స్థాపనకు భవనాల లేకపోవడంతో, అప్పట్లో స్థానిక పాత పాఠశాల భవనాన్ని తాత్కాలికంగా మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకొచ్చారు. కానీ దురదృష్టవశాత్తు, ఆ తర్వాత దశాబ్దకాలంగా భవనానికి ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. ఫలితంగా, ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరుకుంది. రోజురోజుకు గోడలు చిద్రపడుతున్నాయి, ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి నూతన భవన ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వినాయకా.. వెళ్లిరావయ్యా..



జిల్లా కేంద్రంలో మహిళల నృత్యప్రదర్శన



వనపర్తిలో చిన్నారుల నృత్యాలు

సాక్షినెట్‌వర్క్ : జిల్లాలోని పలుగ్రామాల్లో శనివారం గణనాథుల నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వనపర్తి, కొత్తకోట, ఖిల్లా ఘనపురంతో పాటుగా పలుగ్రామాల్లో ఉదయం నుంచి స్వామి వారి మండపాల దగ్గర అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు.





కొత్తకోటలో గణేశ్ శోభాయాత్రలో బొడ్డెమ్మ, కోలాటం ఆడుతున్న భక్తజనం

పేదల పెన్నిధి ప్రధాని మోదీ



పీఎం మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: పీఎం మోదీ పేదలకు పెన్నిది అని బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, జిల్లా ఎస్టీమోర్చా అధ్యక్షుడు రవినాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద పీఎం మోదీ చిత్రపటానికి ఏర్పాటు చేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోని పేద ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయనే ఆలోచనతో నిత్యావసర సరుకులపై జీఎస్టీ తగ్గించడంతో పాటుగా హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్‌లపై పూర్తిస్థాయి జీఎస్టీని తగ్గించారన్నారు. పేద ప్రజలు నిత్యం ఉపయోగించే పప్పులు, నూనె, చక్కెర, బెల్లం, టూత్‌పేస్టు, సిమెంటు, సీకులు, ఎలక్ట్రానిక్ వస్తువులపై జీఎస్టీ తగ్గించడం పేదలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఇలాంటి పీఎం ఉండటం దేశప్రజలకు ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆశన్న, సత్యనారాయణ, గోపాల్‌రెడ్డి, కేశన్న, రవీంద్రాచారి, మల్లేష్, రాములు, చిలుక చెన్నయ్యసాగర్, రాజు, విష్ణు, హేమంత్, శేఖర్, జానకిరాములు, పవన్, నర్సింహా, ఈదమ్మ, ఆంజనేయులు, అయ్యన్న, వేణు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గించడం శుభపరిణామం

వనపర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం అన్నిరంగాల్లో జీఎస్టీ ధరలు తగ్గించడం, పేదలకు ఊరట లభిస్తుందని శనివారం పెబ్బేరు మండలంలోని వైశాఖాపూర్ గ్రామంలో మండల బీజేపీ ఆధ్వర్యంలో పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామరెడ్డి పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పేదప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని జీఎస్టీ ధరలను తగ్గించారన్నారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు నాగరాజుయాదవ్, దేవేందర్‌నాయుడు, కృష్ణారెడ్డి, నాగరాజు, మహేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రహదారిపై ప్రమాదకరంగా కడ్డీలు



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలకేంద్రం నుంచి కంచిరావుపల్లి వెళ్లే రహదారిపై రంగసముద్రం షటర్ల దగ్గర బ్రిడ్జి పై కప్పు నిర్మాణంలో నాణ్యత లోపించి సీకులు తేలి శిథిలావస్థకు చేరిందని స్థానికులు తెలిపారు. పగుళ్లు ఏర్పడి వర్షాలకు సిమెంట్ కొట్టుకుపోయి సీకులు తేలడంతో రంధ్రాలు పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు తెలిపారు. కనుక అధికారులు స్పందించి బ్రిడ్జిపై సిమెంట్ తారు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

జీఎస్టీ పేరుతో దోచుకున్న సంపద పేదలకు పంచాలి

వనపర్తి రూరల్: కేంద్రం పేదల నిత్యవసర సరుకులపై అధిక జీఎస్టీ వడ్డించి దోచుకున్న మొత్తం పేద ప్రజల కోసం ఎంత ఖర్చు పెట్టారో లెక్కలు చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.విజయరాములు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జె.చంద్రయ్య అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఎక్కడ లేని విధంగా దేశంలో జీఎస్టీ వడ్డించి వచ్చిన సంపదనను సంపన్న వర్గాలకు రాయితీరూపంలో కట్టబెట్టారన్నారు. బీహార్ తదితర రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో రాజకీయ లబ్ధికోసం నిత్యవసర వస్తువులపై జీఎస్టీ తగ్గించి ధరలు తగ్గిస్తామని చెబుతున్నారని విమర్శించారు. గ్రామాల్లో



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు

పార్టీని బలోపేతం చేస్తూ స్థానిక ఎన్నికల్లో తమ సత్తాచాటాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కళావతమ్మ, జే.చంద్రయ్య, శ్రీరామ్, రమేష్, కృష్ణవేణి, మోష, లక్ష్మీనారాయణ, సీఎస్ శెట్టి, భాస్కర్, రవీందర్ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

దావత్‌ఖాన్‌పల్లిలో లోపించిన పారిశుద్ధ్యం



పాన్‌గల్: మండలంలోని దావత్‌ఖాన్‌పల్లి ఎస్సీ కాలనీలో లోపించిన పారిశుద్ధ్యంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్ల మధ్యలో పిచ్చిమొక్కలు, వర్షపు నీరు, మురుగునీటి నిల్వలతో ఈగలు, దోమలు వృద్ధి చెందడంతో పాటు దుర్వాసన వెదజల్లుతుండటంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఏ రోగాలు సంభవిస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో లోపించిన పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపడుతూ కాలనీలో నిల్వ నీరు వెళ్లేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఏదుట్లలో ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు

గోపాల్‌పేట: మండలంలోని ఏదుట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవాన్ని సందర్భంగా శనివారం గురువులకు సన్మానించారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న నరేంద్రచారికి అభినందనలు తెలిపారు. అనంతరం హెచ్‌ఎం వేణు చారి, ఉపాధ్యాయులు మధుసూదన్, శ్రీనివాసులు, నాగరాజు, కృష్ణయ్య, రాధ, లక్ష్మి, దర్శన్‌కుమార్, రాజవర్ధన్‌రెడ్డి, లతీష్, బుచ్చారెడ్డిలను విద్యార్థులు సన్మానించారు.

అంకితభావంతో పనిచేయాలి

వీపనగండ్ల: ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసినప్పుడే ఉత్తమ ఫలితాలను వస్తాయని ఎంఈఓ నర్సింహ అన్నారు. శనివారం మండల కేంద్రంలో 15 మంది ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, రఘు, శేఖర్, కల్పన, సాయిలత, ఉపాధ్యాయులు జితేందర్, కృష్ణయ్య, బాలగౌడ్, మహేష్, శ్రీకాంత్, శ్రీనివాసులు, రామచంద్రయ్య, సీఆర్‌పీలు వెంకటేష్, నాగరాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా సురేశ్‌కుమార్

కొత్తకోట: పెబ్బేరు మండలం వైశాఖాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పి.సురేష్‌కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. కొత్తకోట మండలానికి చెందిన ఆయన.. వైశాఖాపూర్ పాఠశాలలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తూ.. తరగతిలో వెనకబడిన పిల్లలపై ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నారు. ఆయన చేస్తున్న కృషికి గాను శనివారం కలెక్టర్ ఆదర్శ్ సురభి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న సురేశ్‌కుమార్

పైపులైన్ నిర్మాణం పరిశీలన

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలకు గోపల్దిన్నె రిజర్వాయర్ నుంచి ఏర్పాటు చేస్తున్న పైపులైన్ పనులను శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటకశాఖ అధికారి నర్సింహ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విశ్వనాథం పరిశీలించారు. పైపులైన్ ఏర్పాటులో ఏయిర్‌వాల్స్, పంపుహౌస్ నిర్మాణానికి అవసరమయ్యే నిధుల కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారాన్ని తీసుకుంటామని పర్యాటకశాఖ అధికారి నర్సింహ తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్య పరిష్కారానికి ప్రజలు తమవంతు సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. వారి వెంట మిషన్ భగీరథ వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితాల ప్రచురణ

పాన్‌గల్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికలకు సంబంధించి డ్రాఫ్ట్ ఓటరు జాబితా, పోలింగ్‌బూత్ వివరాలను శనివారం ఎంపీడీఓ గోవింద్‌రావు సిబ్బందితో కలిసి ఆయన జాబితాలను ప్రచురించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు ఓటరు జాబితాలను ప్రచురించినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల దృష్ట్యా మండలంలోని 28 పంచాయతీల్లో డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాల వివరాలు, ఓటరు జాబితాలను జీపీల్లో అందుబాటులో ఉంచారన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే 8వ తేదీ వరకు అభ్యంతరాలను తెలిపాలన్నారు. మండలంలో మొత్తం ఓటర్లు 42,031 మంది ఓటర్లలో పురుషులు 21,297, స్త్రీలు 20,733, ఇతరులు 1 కలిపి మొత్తం ఓటర్లు 42,031 ఉన్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెంట్ ఓరమ్మ, జూనియర్ అసిస్టెంట్ చైతన్య, టైపిస్టు అర్చన, లక్ష్మణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా విడుదల

ఆత్మకూర్: జెడ్పీటీసీ, ఎంపీటీసీ పోలింగ్ కేంద్రాల



పాన్‌గల్‌లో ఓటరు జాబితాను ప్రచురిస్తున్న ఎంపీడీఓ గోవింద్‌రావు

జాబితాను ఆవిష్కరించినట్లు ఎంపీడీఓ శ్రీపాద్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో 13 పంచాయతీలకు 7 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ కేటాయించామన్నారు. మండలంలో 13 పంచాయతీలకు 32 పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేసామని 19,766 మంది ఓటర్లు ఉన్నారన్నారు. తుదిజాబితాను సోమవారం విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పార్వతమ్మ, విజయ్‌కుమార్‌రెడ్డి, సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాని లబ్ధిదారులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కొత్తకోట: ఇల్లులేని నిజమైన లబ్ధిదారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించడం లేదని సీపీఎం మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ ఆరోపించారు. మున్సిపల్ కేంద్రంలో ప్రజాసమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించగా పలువురికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వలేదని తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇంటికోసం అర్జీ పెట్టుకుంటే ప్రజాపాలన జాబితాలో పేరు వచ్చింది కాని ఇళ్ల మంజూరు సమయంలో తమ పేరు రాలేదని తమ ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. పాకనాటి సుహాసినికి కలెక్టర్ ఆదర్శ్ సురభి ద్వారా ఇల్లు మంజూరు పత్రం ఇచ్చిన బేస్‌మెంట్ లెవెల్ ఇల్లు నిర్మాణం చేసుకున్న బిల్లులు ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. రూ. లక్ష బిల్లుల కోసం అధికారుల చుట్టు, కాంగ్రెస్ నాయకుల చుట్టు తిప్పించుకుంటున్నారని ఆయన విమర్శించారు. సర్వేలో రాములు, నర్సింహులు, బలరాం, కొండన్న, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌తో పొంచి ఉన్న ప్రమాదం

కొత్తకోట: మండలంలోని 7వ వార్డు పరిధిలో రాఘవేంద్ర స్వామి ఆలయం పక్కన ఉన్న స్థలంలో ఇటీవలే లో ఓల్టేజీని నియంత్రించడం కోసం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను నిర్మించేటప్పుడు కాంట్రాక్టర్ సరైన జాగ్రత్తలు తీసుకోకుండా 6 అడుగుల ఎత్తులో, కరెంటు వైర్లు చేతులకు అందేవిధంగా స్తంభానికి అమర్చారు. నిత్యం ఈ దారి వెంట వందల మంది ప్రజలతో ఉండే ఆలయ సమీపంలో కరెంటు వైర్లు ఉండడం వలన ప్రతిరోజూ అక్కడ తెలిసిన వారు జాగ్రత్తలు చెప్పాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ వారికి ఇంతకు ముందే పలుమార్లు విన్నవించడం జరిగిందని అయినా కూడా ఫలితం లేకపోయిందని స్థానికులు



ఆలయానికి పక్కనే అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్

వాపోతున్నారు. ప్రజలకు ఎలాంటి అనర్థం జరగక ముందే విద్యుత్ వైర్లను కప్పి ఉంచుతూ అక్కడ బాక్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కిచెన్ గార్డెన్‌తో తాజా కూరగాయలు

పాన్‌గల్: పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కిచెన్‌గార్డెన్‌తో మధ్యాహ్న భోజనానికి తాజా కూరగాయలు, ఆకు కూరలు లభిస్తాయని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని మాధరావుపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి కిచెన్‌గార్డెన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎం వీరస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కిచెన్‌గార్డెన్ అద్భుతంగా ఏర్పాటు చేశారని తెలిపారు. గోంగూరలో మూడురకాలు, బెండకాయలు ఇతర కాయగూరలు, క్యాబేజీ వంటి వాటిని సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంను ఎంఈఓ సన్మానించారు.



హెచ్‌ఎంతో కలిసి కిచెన్‌గార్డెన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు